సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



వణికిస్తోంది

జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. కొన్ని రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చలి తీవ్రత నుంచి రక్షించుకోవడానికి ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. వివరాలు 8లో ▸



కారులో చెలరేగిన మంటలు

కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం సమీపంలోని రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు 8లో ▸

ఓటరు జాబితా రూపొందించాలి

సిద్దిపేటరూరల్: ఓటరు జాబితా సవరణలో భాగంగా స్పష్టమైన జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కలెక్టర్ జీవన్‌పాటిల్‌కు సూచించారు. ఈ మేరకు సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఓటరు నమోదు, సవరణలు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో రమేశ్ బాబు, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వృద్ధాశ్రమ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటఅర్బన్: ఎల్లుపల్లి శివారులోని 25 పడకల ప్రభుత్వ వృద్ధాశ్రమాన్ని కో–మేనేజ్‌మెంట్ విధానంలో నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనీసం మూడేళ్లు వృద్ధాశ్రమం నిర్వహించడంలో మంచి నమ్మకం కలిగి ఉండాలన్నారు. వృద్ధాశ్రమం నిర్వహణకు అయ్యే ఖర్చులో 70 శాతం ప్రభుత్వం నుంచి మంజూరు అవుతుందన్నారు. 30 శాతం స్వచ్ఛంద సంస్థ భరించాలన్నారు. ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ కాపీ, సభ్యుల వివరాలు, లక్ష్యాలు, రెండు సంవత్సరాల వార్షిక నివేదికలు, ఆడిట్ రిపోర్ట్స్‌తో పాటు దరఖాస్తును కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల, వయో వృద్ధుల కార్యాలయంలో ఈ నెల 21 లోగా అందజేయాలన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.69.08లక్షలు



నగదు లెక్కిస్తున్న శివరామకృష్ణ సేవాసమితి సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామికి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.69,08,932 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి బాలాజీ తెలిపారు. సోమవారం స్వామివారి ఆలయ ముఖ మండపంలో దేవాదాయశాఖ మెదక్ జిల్లా పరిశీలకుడు రంగారావు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది, శివశక్తి సేవాసమితి సభ్యులు లెక్కించారు. నగదు రూ.69,08,932, విదేశీ కరెన్సీ నోట్లు 12, మిశ్రమ బంగారం 20 గ్రాములు, మిశ్రమ వెండి 6కిలోల 500 గ్రాములు, పసుపు బియ్యం 6 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణ అధికారి మాట్లాడుతూ 60 రోజులలో హుండీల ద్వారా లభించిన నగదును స్థానిక బ్యాంక్‌లో జమ చేసినట్లు తెలిపారు.

విలీనంపై ఆర్డీఓను కలిసిన గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల పరిధిలోని గోవర్ధనగిరి, రేగొండ గ్రామాల ప్రజలు సోమవారం ఆర్డీఓ బెన్ షాలోమ్‌ను కలిశారు. ఇటీవల తమ గ్రామాలను హుస్నాబాద్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఈ విషయంలో తుది నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందని అడిగారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల విలీనం విషయం ప్రస్తుతం సీసీఎల్ పరిధిలో ఉందని ఎప్పుడు వస్తుందో చెప్పలేమన్నారు. మా చేతిలో ఏమీ లేదని అంతా సీసీఎల్‌లోనే ఉంటుందన్నారు.


కిక్ బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



కిక్ బాక్సింగ్ పోటీల్లో మెడల్స్‌ను అందుకున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారని కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 9, 10 తేదీల్లో హన్మకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 500మంది వరకు పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా జరిగిన పాయింట్ ఫైటింగ్ పోటీలో గజ్వేల్‌కు చెందిన సాత్విక్, జగదేవ్‌పూర్‌కు చెందిన ఎల్లేష్‌లు అద్భుతమైన ప్రతిభ చాటి బంగారు పతకాలను సాధించారన్నారు. జగదేవ్‌పూర్‌కు చెందిన ప్రవళిక, వరుణ్‌లు వెండి పతకాలు, గజ్వేల్‌కు చెందిన సాన్వి, జగదేవ్‌పూర్‌కు చెందిన మహతి, వరుణ్ కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు వెంకట నర్సయ్య ఎంపిక



అక్కన్నపేట(హుస్నాబాద్): మల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న జంగపల్లి వెంకట నర్సయ్య జాతీయ సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యారు. గత నెల అక్టోబర్ 18,19వ తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈ నెల 15 నుంచి 17 వరకు న్యూఢిల్లీలో జరిగే స్విమ్మింగ్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

కాంగ్రెస్‌లో మళ్లీ రచ్చ

అప్పుడే మొదలైన వర్గపోరు
- మంత్రి రాకతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చింపివేత
- పోలీస్‌స్టేషన్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- సీసీ ఫుటేజీ ఆధారంగా నాయకుల గుర్తింపు!



మైత్రివనం మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ధ్వంసం

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్ పార్టీలో మళ్లీ వర్గపోరు మొదలైంది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి సారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఫ్లెక్సీలను ఆదివారం రాత్రి ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వేళ కొందరు పార్టీ నాయకులు చింపివేశారు. మంత్రి జిల్లాకు వస్తున్న ముందు రోజే వర్గ విభేదాలు బయటపడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారం రోజుల లోపే వర్గాలుగా విడిపోయారు. నాయకులకు నామినేట్ పదవులు, ఎలాంటి ఎన్నికలు రాకముందే రచ్చకెక్కారు.

పార్టీలో చేర్చుకోవడంతో..

ఇటీవల సిద్దిపేట పట్టణానికి చెందిన వహిద్ ఖాన్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంతో ఓ వర్గం నేతలు వ్యతిరేకించినట్లు సమాచారం. తమకు తెలియకుండానే పార్టీలో చేర్చుకోవడంతో డీసీసీ కార్యదర్శి షాబోద్దీన్, ఎస్సీసెల్ నాయకుడు నరేశ్‌లు వ్యతిరేకించినట్లు తెలిసింది. మంత్రి వస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేశారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఫ్లెక్సీలను చింపేసిన వ్యక్తులను పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వర్గాల కట్టడి జరిగేనా?

కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సిద్దిపేట నియోజకవర్గం నుంచి 15 మంది ఎమ్మెల్యే టికెట్‌లను ఆశించారు. పార్టీ నుంచి హరికృష్ణ పోటీ చేసినప్పటికీ టికెట్ ఆశించిన నాయకులు ఎవరూ సహకరించలేదని చర్చ సాగుతోంది. పార్టీలో 14 మంది నాయకులు మూడు నుంచి నాలుగు వర్గాలుగా ఉంటున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా వర్గాలను కట్టడి చేసి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలల్లోకి తీసుకవెళ్లి ప్రచారం చేయాలి. లేనట్లయితే ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ఎవరు అమలు చేస్తున్నారో చెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక దృష్టి సారించి గాడిలో పెట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు. లేదంటే త్వరలో జరిగే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభావం పడుతుందని పార్టీలో చర్చించుకుంటున్నారు.

‘గ్రూపు’లుగా మంత్రిని కలిసిన నేతలు



మంత్రి పొన్నంకు తన అనుచరులతో కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్‌కు చెందిన రెండు గ్రూపుల నాయకులు వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, అలాగే టికెట్ ఆశించి భంగపడిన పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డిలు అనుచరులతో వేర్వేరుగా శుభాకాంక్షలు తెలపడం హాట్ టాపిక్‌గా మారింది. ఇదిలా ఉంటే.. దుబ్బాకలో కాంగ్రెస్ ఓటమికి గ్రూపు విభేదాలే కారణమా.. ’ అనే శీర్షికన ‘సాక్షి’లో ప్రచురితమైన కథనం సైతం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పార్టీలో విభేదాలు సమసిపోయేందుకు ఎలాంటి దిద్దుబాటు చర్యలు తీసకుంటారోనన్నదానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.



సిద్దిపేటలో మంత్రి పొన్నంను సన్మానిస్తున్న టీఎన్జీఓ నాయకులు, చిత్రంలో కలెక్టర్ తదితరులు

కలిసి పనిచేద్దాం..

- ఆదర్శ జిల్లా మీ చేతుల్లోనే..
- మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేటజోన్: గత ప్రభుత్వానికి ఇచ్చిన సహకారాన్ని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులంతా కలిసి పనిచేద్దామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం మంత్రి హోదాలో జిల్లాకు వచ్చిన ఆయనను సిద్దిపేట, సిరిసిల్ల జిల్లా టీఎన్జీఓ సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా ఉద్యోగులు కష్టపడే మనస్తత్వం వారన్నారు. జిల్లాను ఆదర్శ జిల్లాగా మార్చడంలో మీ సహాయ సహకారాలు ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేందర్ రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యత

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే తమ మొదటి ప్రాధాన్యత ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లాకు తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తామన్నారు. ప్రతి 15 రోజులకొకసారి అభివృద్ధిపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మించిన తరువాత, కొద్ది రోజులుగా మూడు వాహనాలు గూగుల్ మ్యాప్ ద్వారా నీటిలోకి వెళ్తున్నాయని, ఈ సమస్య పరిష్కరణ దిశగా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక సమస్యలు తిష్టవేశాయని, వాటి పరిష్కరించేందుకు కొద్దిగా సమయం పడుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నంను పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ కార్మికులు, న్యాయవాదులు సన్మానించారు.

పేదల ఆకాంక్షల మేరకు పాలన

కొండపాక(గజ్వేల్): పేదల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యిందని, పాలన కూడా అలాగే సాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కుకునూరుపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విరూపాక్ష శ్రీనివాస్ రెడ్డి నూతన గృహ ప్రవేశంలో, కొండపాక మండలం దుద్దెడ శివారులోని టోల్ ప్లాజా సమీపంలో మంత్రికి కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కార్యకర్తను ప్రభుత్వం తప్పక గుర్తిస్తుందన్న భరోసా నిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఎంపీటీసీ విరుపాక ప్రణవీ, మండలాల అధ్యక్షులు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వాసరి లింగారావు, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు



జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్ రోజాశర్మ, అధికారులు

- రైతులకు ఇబ్బందులు రావొద్దు
- జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేటజోన్: ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జెడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం జెడ్పీ కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి అంశాలపై ఎమ్మెల్సీ యాదవ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యాసంగి సీజన్ కు సంబంధించి అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్, మల్బరీ సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. మన బడి పథకం లో పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశాల్లో జెడ్పీటీసీలు కొండల్ రెడ్డి, లక్ష్మి, జిల్లా వైద్యాధికారి కాశీనాథ్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ..



అగ్నిగుండాలు తొక్కుతున్న వీరభద్రయ్యస్వామి, భక్తులు

- వైభవంగా శివపార్వతుల కల్యాణం
- శివనామంతో మార్మోగిన శంభునికొండ

వర్గల్(గజ్వేల్): మహాదేవుడు వెలిసిన వర్గల్ శంభుని కొండ శివనామస్మరణతో మార్మోగింది. ఆదిదంపతుల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. శంభునిగుట్టపై స్వయంభువుగా వెలిసిన అన్నపూర్ణ సమేత శంభులింగేశ్వరుని సన్నిధానంలో కార్తీక సోమవారం ఆదిదంపతుల కల్యాణం, వీరభద్ర స్వామి ప్రస్తాయం, అగ్నిగుండ ప్రవేశాది కార్యక్రమాలతో భక్తిపారవశ్యం నెలకొంది. అర్చకుడు వీరభద్రయ్య స్వామి నేతృత్వంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి ప్రస్తాయం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణవేదిక వద్దకు తీసుకొచ్చారు. ఎదుర్కోలు, యజ్ఞోపవిత ధారణాది వివాహ తంతు నిర్వహించి, సుముహూర్త వేళ భక్తజన హర్షధ్వానాలు, భాజాభజంత్రీలు, మంత్రోచ్ఛరణ మధ్య శివ్వయ్య స్వామి, పార్వతి మాత మెడలో మంగళ సూత్ర ధారణ చేశారు. అంగరంగ వైభవంగా సాగిన కల్యాణ వేడుకను తిలకించి భక్తజనులు పునీతులయ్యారు. కట్నకానుకలు సమర్పించారు.

అగ్నిగుండ ప్రవేశాలు..

సాయంత్రం శివాలయం ముందర అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం వైభవంగా జరిగింది. అగ్నిగుండం వద్ద బలిహరణ అనంతరం ఆలయ అర్చకులు వీరభద్రయ్య స్వామి అగ్నిగుండంలో నిప్పులను తొక్కుతూ ముందుకుసాగిపోగా, శివస్వాములు, భక్తజనులు అనుసరించారు. ఈ మహోత్సవంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, భక్తజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి

- ప్రజావాణి చక్కని వేదిక
- సమస్యల పరిష్కారం సులువు
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



దివ్యాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికలు ముగియడం.. కోడ్‌ను ఎత్తివేయడంతో సోమవారం నుంచి ప్రజావాణి మళ్లీ మొదలైంది. ఈ మేరకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ జిల్లా వ్యాప్తంగా అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేరుగా తమ సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు ప్రజావాణి కార్యక్రమం చక్కని వేదికగా మారిందన్నారు. అధికారులు అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించేలా చొరవ చూపుతూ ఉత్సాహంగా పనిచేయాలన్నారు. పలు రకాల సమస్యలతో కూడిన 26 మంది అర్జీలను కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల పాటు ప్రజావాణి నిలిపివేశారు. దీంతో ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో మళ్లీ ప్రజావాణి ద్వారా అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం పునరుద్ధరించింది. దీంతో సోమవారం ప్రజలు హాజరై వారి సమస్యలను కలెక్టర్, అధికారులకు అందించారు.

పెరగనున్న అర్జీలు..

ప్రజావాణి నిలిపివేయడంతో ప్రజలకు సంబంధించి పలు రకాల సమస్యలు పేరుకుపోయాయి. ఈమేరకు ప్రజలు రాబోయే ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా మరిన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించనున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో మళ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందనే భావనతో ప్రజలు సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరయ్యే అవకాశాలున్నాయి.

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా బీసీ డీ కేటగెరిలో ఉన్న ముదిరాజ్ కులస్థులను ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని కోరుతూ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్‌లకు సరైన రిజర్వేషన్ లేక ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్ రాకముందే ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జేఏసీ చైర్మన్ ప్రశాంత్, సోషల్‌మీడియా రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కూటీలు అందించండి

స్కూటీలు అందించాలని చేర్యాల, మద్దూరు, నంగునూరు, దూల్మిట్ట మండలాలకు చెందిన దివ్యాంగులు కోరారు. గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసుకున్నామన్నారు. స్కూటీలు మంజూరైనప్పటికీ పంపిణీ చేసే క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ లేనందున వెంటనే మంజూరైన స్కూటీలను అధికారులు పంపిణీ చేయాలన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో దివ్యాంగులు

మా గోడును పట్టించుకోండి

గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో చాలా ఏళ్లుగా అద్దెకు ఉంటూ కుటుంబాలను గడుపుతున్నామని, డబుల్‌బెడ్రూం ఇళ్లకు దరఖాస్తు చేసుకున్నామని లబ్ధిదారులు తెలిపారు. గత మార్చి 21న లక్కీడ్రాలో మాకు ఇళ్లను సైతం కేటాయించారన్నారు. ఇప్పటికీ తొమ్మిది నెలలు గడుస్తున్నా ఇళ్లు, ధ్రువ పత్రాలు అందించలేదని తెలిపారు. ఎన్నికల కోడ్‌కు ముందు నిరసన చేపడితే గడా అధికారి, మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు వారిని అడిగితే ఎవరూ తమ గోడును పట్టించుకున్న పాపాన పోవడంలేదని, అధికారులు స్పందించి మాకు కేటాయించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇవ్వాలన్నారు.



వినతిపత్రాన్ని చూపుతున్న డబుల్ బెడ్రూం లబ్ధిదారులు

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండలం దామరకుంట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. సోమవారం దామరకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట రాములు, ఉపాధ్యాయులు వారికి మెమోంటోలను అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 జనవరిలో ఢిల్లీ లేదా రాజస్థాన్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇలాంటి అవకాశాలను మరిన్ని అందిపుచ్చుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నబ్రహ్మయ్య, రమేశ్, బాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సుభాష్‌చంద్ర, రేఖ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్‌కు..

తొగుట(దుబ్బాక): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సయ్యద్ బాబా రాష్ట్ర స్థాయి అండర్ 14 వాలీబాల్ జట్టుకు ఎంపికై నట్టు పాఠశాల హెచ్‌ఎం ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. చదువులతోపాటు క్రీడల్లో రాణిస్తున్న సయ్యద్ బాబాను, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీధర్‌ను హెచ్‌ఎం అభినందించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు..



అక్షితతో పీటీ వెంకటస్వామి గౌడ్

సిద్దిపేటరూరల్: హనుమకొండలో మూడురోజులపాటు జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జెడ్పీహెచ్‌ఎస్ రాఘవాపూర్ పాఠశాలకు చెందిన అబ్బుల అక్షిత బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ సోమవారం తెలిపారు. అండర్ -17 బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. త్వరలో బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎంపీపీ శ్రీదేవిచందర్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుభార్గవి, సర్పంచ్ రమేశ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, చైర్మన్ కనకరాజు, ఉపాధ్యాయ బృందం అక్షిత, పీఈటీ వెంకటస్వామిని అభినందించారు.

యోగా పోటీలకు..



మనోజ్‌కుమార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జాతీయ స్థాయి యోగా పోటీలకు సిద్దిపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి మనోజ్‌కుమార్ ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ రెడ్డి సోమ వారం తెలిపారు. సెకండర్ ఇయర్ చదువుతున్న మనోజ్ కుమార్ నల్గొండ జిల్లా మిర్యాలగూడలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 పోటీల్లో పాల్గొని నాలుగో స్థానం సాధించారన్నారు. డిసెంబర్ 19 నుంచి 21 వరకు కలకత్తాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు.

ఎర్ర సిరాతో మంత్రి సీతక్క చిత్రం



దుబ్బాక: ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చిత్రాన్ని దుబ్బాకకు చెందిన ప్రముఖ చిత్ర కారుడు కాముని మల్లికార్జున్ ఎరుపు రంగు సిరాతో వేసి మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలిపారు.



సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఉన్న దుస్తులను కొంటున్న ప్రజలు

వణికిస్తోంది

చలి గుప్పిట ప్రజలు
- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- మంచులో వాహనదారుల ఇబ్బందులు

మూడు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు

శనివారం	14.05 డిగ్రీలు
ఆదివారం	13.01 డిగ్రీలు
సోమవారం	12.00 డిగ్రీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా ప్రజలను చలి వణికిస్తోంది. బంగాళఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ కారణంగా కొద్ది రోజులుగా జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. మధ్యాహ్నం కాస్త ఎండ కొడుతున్నా అంతంత మాత్రంగానే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలు చలిగుప్పిట ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్రత నుంచి రక్షించుకోవడానికి ఉన్ని బట్టలు, స్వెట్టర్లు, మప్లైర్లు, తలపాగాలు ధరిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు గజ్వేల్, చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్ పట్టణాలు, ప్రధాన రహదారుల వెంట శరీరాన్ని చలి నుంచి రక్షించే దుస్తులను రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఉదయం, రాత్రి సమయల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనదారులు సైతం బెంబేలెత్తిపోతున్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నేడు 14 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతాయని చెబుతున్నారు.

8 తర్వాతే షాపునకు..



జిల్లా కేంద్రంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాను. దుకాణం తెరవడానికి ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయలు దేరుతాను. కానీ వారంరోజులుగా ఉదయం 8 గంటలు అయినా ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది. అదే విధంగా రాత్రి 10 గంటలకు మూసివేసే షాపును 7 గంటలకే మూసి వేస్తున్నాను.

– మార్కండేయులు, సిద్దిపేట

బయటకు వెళ్లలేకపోతున్నాం



పది రోజులుగా చలి తీవ్రత పెరిగింది. దీంతో బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నేళ్లుగా ఇంతటి చలి తీవ్రత ఎన్నడూ చూడలేదు. మంచు కారణంగా తెల్లారి 8 గంటలు అయినా సూర్యుడు కనిపించడం లేదు. ఉదయం, రాత్రి సమయల్లో అత్యవసర పని ఉంటేనే బయటకు వెళ్తున్నాం.

–అలేటి లింగం, వల్లంపట్ల

తక్షణమే కంచె ఏర్పాటు చేయండి

- ప్రాజెక్టులోకి డీసీఎం దూసుకెళ్లిన ఘటనపై స్పందించిన మంత్రి పొన్నం
- గూగుల్ మ్యాప్ నుంచి తొలగించేలా చూడాలని కలెక్టర్‌కు ఆదేశం

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులోకి దూసుకెళ్లిన డీసీఎం వ్యాన్ అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జీవన్ పాటిల్‌కు ముంపు గుడాటిపల్లి గ్రామ రోడ్డును గూగుల్ మ్యాప్ నుంచి తొలగించాలని కోరుతూ గూగుల్ వారికి లేఖ రాయాలని, మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నందారం స్టేజీ దాటాక గౌరవెల్లి ప్రాజెక్టు వైపు ఎవరూ వెళ్లకుండా పెద్ద కంచెను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



నట్టేట ముంచిన గూగుల్ మ్యాప్

'నట్టేట ముంచిన గూగుల్ మ్యాప్' కథనం

సులభపద్ధతిలో బోధించాలి

రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ స్వర్ణలత

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ సెక్రెటరీ స్వర్ణలత అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి ప్రభుత్వ పాఠశాల, అదే విధంగా రుద్రారం ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓ పీపీ రాథోడ్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తరగతి గదిలో తిరిగి విద్యార్థులతో చదివించడం, రాయించడం చేశారు. అధికారిని అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు జవాబులు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలకు వచ్చిన అక్షయపాత్ర భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల, హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న స్వర్ణలత

ఇంట్లోని నగదు, బంగారం చోరీ

దుబ్బాకరూరల్: గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని రామక్కపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యాజమాని బొడ్డుబాబు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని చీకోడ్ గ్రామంలో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుల గొట్టి అందులోని నగదు రూ.20 వేలు, బంగారం ఎత్తుకెళ్లారు. బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

నగల షాపునకు రంధ్రం పెట్టి..

గజ్వేల్‌రూరల్: ఓ నగల దుకాణంలో చోరీ జరిగిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌లో రోడ్డుపైన జెడ్పీహెచ్‌ఎస్ పక్కనగల ముఖేష్ అనే వ్యక్తికి చెందిన నగల దుకాణం ఉంది. దీని పక్కనే ఉన్న మరో దుకాణం గోడకు రంధ్రం చేసిన దుండగులు నగల దుకాణంలోకి చొరబడి సుమారు 6 కిలోలకు పైగా వెండి వస్తువులు దొంగిలించారు. విషయం తెలుసుకున్న దుకాణం నిర్వాహకుడు ముఖేష్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

కారులో చెలరేగిన మంటలు

- తప్పిన పెను ప్రమాదం
- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు
- గౌరారం వద్ద రాజీవ్ రహదారిపై ఘటన

వర్గల్(గజ్వేల్): డివైడర్‌ను దూసుకొని అవతలి వైపు వెళ్లిన కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తి దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం ఉదయం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలోని రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబులాపూర్‌కు చెందిన వంగ భాస్కర్‌రెడ్డి హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన భార్య లాస్య, కుమారుడు హయాన్‌రెడ్డి, బావమరిది మహిపాల్‌రెడ్డిలతో కలిసి తమ కారులో బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ వచ్చాడు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి మియాపూర్‌కు వెళ్తుండగా గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై ముందు వెళ్తున్న లారీ బ్రేక్ వేయడంతో కారు డ్రైవర్ సంపత్ స్టీరింగ్‌ను కుడివైపునకు తిప్పాడు. దీంతో కారు డివైడర్‌ను దాటేసి రెండోవైపు రోడ్డును దాటుతూ చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. అందులో ఉన్న వారు గమనించి దిగిపోగా, కారు పూర్తిగా దగ్ధమైంది. గౌరారం పోలీసులు ఘటనా స్థలం చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని ఎస్సై విజయభాస్కర్ తెలిపారు.



ప్రమాదంలో దగ్ధమవుతున్న కారు



ఘటనా స్థలం వద్ద భాస్కర్‌రెడ్డి, కుటుంబీకులు

ఫోన్ పోతే టెన్షన్ వద్దు

- సత్ఫలితాలనిస్తున్న సీఈఐఆర్ పోర్టల్
- జిల్లాలో ఇప్పటివరకు 2,770 ఫిర్యాదులు
- 343 ఫోన్లను రికవరీ చేసిన పోలీసులు

పటాన్‌చెరుటౌన్: పోగొట్టుకున్న ఫోన్ ఎక్కడుందో తెలుసుకోవడానికి ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్ట్రీ(సీఈఐఆర్) పోర్టల్ సత్ఫలితాలనిస్తుంది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 2,770 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 1,140 ట్రేసింగ్‌లో ఉన్నాయి. 343 ఫిర్యాదులకు సంబంధించి బాధితులకు ఫోన్లు అప్పగించారు. 1,323 ఫోన్లను పోలీసులు ట్రేస్ చేయాల్సి ఉంది.

పోర్టల్ నమోదు ఇలా..

ఫోన్ చోరీ జరిగిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అనంతరం మీ సేవలో ఫోన్ పోగొట్టుకున్నట్టు ఐఎంఈఐ నంబర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. అలాగే, పాత నంబర్‌తో సిమ్ తీసుకోవాలి. దీంతో ఫోన్‌లోని సిమ్ కార్డ్ ఆటోమెటిక్‌గా బ్లాక్ అవుతుంది. అనంతరం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీఈఐఆర్. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ లేదా స్టోలెన్ మొబైల్ లింక్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేయాలి పోగొట్టుకున్న ఫోన్ నంబర్, ఐఎంఈఐ నంబర్లు, కంపెనీ పేరు, మోడల్, బిల్లు, ఆధార్ కార్డు, సమాచారం అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన 24 గంటల్లోగా సీఈఐఆర్ పోర్టల్ సిబ్బంది ఆ ఫోన్‌ను బ్లాక్ చేసి పనిచేయకుండా చేస్తారు. దొరికిన వ్యక్తి వేరే సిమ్ వేయగానే పోలీసులకు ఆ నంబర్ డిస్‌ప్లే అవుతుంది. వెంటనే పోలీసులు ఆ నంబర్‌కు ఫోన్ చేసి అది పోగొట్టుకున్న ఫోన్ అని తిరిగి ఇవ్వకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరిస్తారు. బాధితుడికి ఫోన్ అందగానే పోర్టల్‌లో అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్ ఆప్షన్‌లోకి వెళ్లి రిక్వెస్ట్‌ను తొలగించే అవకాశం కూడా ఉంటుంది.



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న సీఐ లాలూ నాయక్, డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి (ఫైల్)

అవగాహన కల్పించాం



సీఈఆర్ పోర్టల్ గురించి ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాం. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరుకితే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలి. తక్కువ ధరకు వస్తున్నాయని సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేయొద్దు. సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా చోరీకి గురైన, పోగొట్టుకున్న ఫోన్లను సులభంగా రికవరీ చేస్తున్నాం.

– బాలాజీ, పటాన్‌చెరు ఇన్‌చార్జి డీఎస్పీ

తెర తీయరా?



మెదక్ కలెక్టరేట్: గతంలోనే ప్రారంభమైన కలెక్టరేట్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మూసివేశారు. ప్రస్తుతం ఎన్నికలు పూర్తయ్యి 12 రోజులవుతున్నా శిలాఫలకంపై అతికించిన కాగితాలు తొలగించకపోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధి గోమారం-సికింద్లాపూర్ రోడ్డుపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి రత్నాపూర్ గ్రామానికి చెందిన బొల్లు మల్లయ్య వీరారెడ్డిపల్లి గ్రామంలో ఉన్న బంధువులు దగ్గరికి వెళ్లేందుకు గోమారంలో బస్సు దిగాడు. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కొత్తపేట తండాకు చెందిన వ్యక్తి ఎదురుగా బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లయ్య రెండు కాళ్లు విరిగిపోగా, బైక్‌పై ఉన్న వ్యక్తి రోడ్డుపై ఏర్పాటు చేసిన ధాన్యం కుప్పలను ఢీకొట్టాడు. దీంతో అతడికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, సికింద్లాపూర్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి 108 అంబులెన్స్‌లో తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

బావిలో పడి యువకుడు మృతి



సందీప్(ఫైల్)

జహీరాబాద్: బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అర్జున్‌నాయక్ తండాలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అర్జున్‌నాయక్ తండాకు చెందిన సందీప్(30)కి ఆరు నెలల నుంచి మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. సోమవారం తండా శివారులోని వ్యవసాయ బావిలో సందీప్ మృతి చెంది ఉండగా తండావాసులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పిన బైక్..

కిందపడటంతో వ్యక్తి మృతి



మల్లేశం మృతదేహం

చేగుంట(తూప్రాన్): బైక్ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట గ్రామానికి చెందిన బక్క మల్లేశం(28) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి కర్నాల్‌పల్లిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్నాడు. మార్గమధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో మల్లేశ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్ భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు.

సాహిత్య సేవే పరమావధిగా..

- తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకొన్న అన్నాచెల్లెళ్లు
- కవితలు, రచనలో ఎవరికి వారే సాటి..

చిన్నకోడూరు(సిద్దిపేట): సాహిత్యాన్ని తమ తండ్రి వారసత్వంగా స్వీకరించి చిన్ననాటి నుంచే సాహిత్య వాతావరణంలో ఒనామలను నేర్చుకొని ఇంతింతై వటుడింతై అన్నట్లుగా గ్రామ పేరును నలుదిశలా విస్తరింపచేశారు అన్నాచెల్లెళ్లు. మండల పరిధిలోని చౌడారం గ్రామానికి చెందిన కవి, తెలుగు ఉపాధ్యాయుడు కటుక్వోజుల ఆనందం సాహిత్యంపై మక్కువ. ఆయన కుమారుడు లాల్‌బహదూర్ శాస్త్రీ, కూతురు ఫణీశ చిన్నప్పటి నుంచి తెలుగులో రాణిస్తున్నారు. సాహిత్యం, కవితలు, పద్యాలపై మక్కువ చూపుతున్నారు. రచనలు, కవిత్వంలో ఎక్కడ పోటీలు జరిగినా అన్నా చెల్లెళ్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవాల్సిందే. దీనికి తోడు కవితలతో ఎక్కడ సమావేశాలు నిర్వహించినా వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని తెలుగు భాష గొప్పదనాన్ని, కవితల ద్వారా సభలో వినిపించారు. ఈ సందర్భంగా ఇద్దరినీ తెలుగు భాషాభిమానులు ఘనంగా సత్కరించారు. సిద్దిపేటలో ఇటీవల జరిగిన కవుల సన్మాన సభలో మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు కవులు, ప్రముఖులు వీరిని సన్మానించారు.



అవార్డులు, సన్మానాలతో శాస్త్రీ, ఫణీశ

రెండో వివాహానికి అడ్డుగా ఉందనే..

- భార్యను హత్య చేసిన భర్త
- అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కేసును మిరుదొడ్డి పోలీసులు ఛేదించారు. రెండో వివాహానికి అడ్డుగా ఉందన్న నేపంతోనే కట్టుకున్న భార్యను కడతేర్చిన భర్తతోపాటు అందుకు సహకరించిన అత్తమామలను పోలీసులు అరెస్ట్ చేసి కటకటాలకు పంపారు. సోమవారం మిరుదొడ్డి ఎస్ఐ నరేశ్‌తో కలిసి గజ్వేల్ ఏసీపీ ఎం.రమేశ్ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మిరుదొడ్డికి చెందిన మొగుళ్ల కమలాకర్‌తో వర్గల్ మండలం గుంటిపల్లికి చెందిన బొమ్మలక్ష్మీ, చిన్న మల్లయ్య పెద్ద కూతురు పద్మ (22)కి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో పెద్ద మొత్తంలో కట్న కానుకలను ముట్టజెప్పినప్పటికీ అదనపు కట్నం కోసం భార్యను కమలాకర్ వేధించసాగాడు. అనుకున్న కట్నం పద్మ తేలేదని గ్రహించిన కమలాకర్ రెండో వివాహానికి పూనుకున్నాడు. ఇందుకు భార్యను అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో 9వ తేదీన తెల్లవారుజామున పద్మ గొంతు నులిమి చంపేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొన్న పోలీసులు భర్తతోపాటు అత్తామామలను విచారించగా నిజం ఒప్పుకున్నారు. వెంటనే వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బస్సు టైరు కింద పడి మహిళ మృతి



భూక్య లక్ష్మీ (ఫైల్)

అక్కన్నపేట (హుస్నాబాద్): ఓ ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బస్సు టైరు కింద నలిగి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బంగారులొద్దితండా వద్ద చోటుచేసుకుంది. ఎస్సై తాండ్ర వివేక్, కథనం ప్రకారం.. అక్కన్నపేట మండలం ముంపు గుడాటిపల్లి గ్రామ పరిధిలోని సోమాజితండాకు చెందిన భూక్య లక్ష్మీ(70) కొడుకు, కోడలు సోమవారం ఉదయం హైదరాబాద్ వెళ్తున్నారు. వారిని తన ఇంటి వద్ద హుస్నాబాద్ డిపోకు చెందిన బస్సులో ఎక్కించి మనవడికి డబ్బులు ఇవ్వబోతుండగా.. డ్రైవర్ పతంగి రవీందర్ బస్సును ముందుకు తీసుకెళ్లడంతో ఆమె బస్సు కింద పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న తండావాసులు రామవరం గ్రామ శివారులోని కొండాపూర్ వద్ద బస్సును ఆపి పోలీసులకు అప్పగించారు. డ్రైవర్ రవీందర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి చెందిన ఘటన జిన్నారం మండలంలోని ఖాజీపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు.. ఖాజీపల్లి గ్రామానికి చెందిన చిట్ల జగన్, శాగ కృష్ణ, హకీమ్‌కు సంబంధించిన ఐదు గేదెలు సమీపంలోని పంట పొలాల వద్ద మేత మేస్తున్నాయి. అప్పుడే ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడటంతో ఐదు గేదెలు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంతో తాము తీవ్రంగా నష్టపోయామని, అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, అధికారుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయని, ఇందుకు కారణమైన విద్యుత్ అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.



మృతి చెందిన గేదెలు